సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 15, మే, 2024



సోమశిలలో 7.74 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 7.742 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,689
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,889
నవర (8 గ్రాములు)	రూ.55,112



ప్రమాదంలో ఒకరి మృతి

బైక్‌లు ఢీకొనడంతో యువకుడు మృతి చెందారు. లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్ట్ బంగ్లా వద్ద ఘటన మంగళవారం చోటుచేసుకుంది.

8లో

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన ఈవీఎంలు



కంటైనర్‌లోని ఈవీఎం బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తున్న కూలీలు



సీల్ వేస్తున్న కలెక్టర్ హరినారాయణన్



పహారా కాస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు

- మూడంచెల భద్రత

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల పోరు ముగిసింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడం, వివిధ కారణాలతో సోమవారం రాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. అనంతరం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో గల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. వీటికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో మంగళవారం సీల్ వేశారు. మూడంచెల భద్రతను జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసింది. జిల్లా పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు బందోబస్తు విధులను నిర్వర్తిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్దకు ఎవర్నీ అనుమతించొద్దని ఆదేశించారు.

ఈవీఎంలలో భవితవ్యం నిక్షిప్తం

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుపై రాజకీయ పార్టీలు ధీమాతో ఉన్నాయి. పోలింగ్ సరళిపై ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు. నియోజకవర్గాల పరిధిలోని వార్డులు, గ్రామాల వారీగా జరిగిన పోలింగ్‌ను పరిశీలిస్తున్నారు. ఓటరు తీర్పు, నేతల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. విజయం ఎవరిదో జూన్ నాలుగున తేలనుంది.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి ఎనిమిది గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. స్వామివారిని 70,815 మంది సోమవారం అర్ధరాత్రి వరకు దర్శించుకోగా, తలనీలాలను 25,245 మంది భక్తులు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.16 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు ఎనిమిది గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారికి రెండు గంటల్లో దర్శనమవుతోంది.

తెరుచుకున్న మద్యం దుకాణాలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల తరుణంలో రెండు రోజుల పాటు మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు మంగళవారం తెరుచుకున్నాయి. దీంతో దుకాణాల వద్ద మందుబాబులు బారులుదీరారు. కాగా ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ నాలుగున మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర తొలి దశ అడ్మిషన్ల ప్రక్రియను బుధవారం ప్రారంభించనున్నామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 21 వరకు స్వీకరించి.. తొలి దశ అడ్మిషన్లను 22 నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర తరగతులను జూన్ ఒకటి నుంచి నిర్వహించాలని ఆదేశించారు. రెండో దశ అడ్మిషన్లను జూన్ పది నుంచి జూలై ఒకటి వరకు నిర్వహించనున్నామని ప్రకటించారు. అడ్మిషన్లలో రిజర్వేషన్లను పాటించడంతో పాటు మంజూరైన సీట్లకు మించి అదనంగా ప్రవేశాలను చేపట్టకూడదని స్పష్టం చేశారు. మొత్తం సీట్లలో మూడో వంతును బాలికలకు కేటాయించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో సెక్షన్‌కు 88కు మించి అడ్మిషన్లను చేపట్టరాదన్నారు. కళాశాలలో ఉన్న కోర్సులు, ఫీజుల వివరాలను బోర్డుల్లో ప్రదర్శించాలని చెప్పారు. ఇంటర్ బోర్డు అనుమతున్న కళాశాలల వివరాలను తెలుసుకొని అందులోనే చేర్పించాలని, వివరాలకు 0861 2320312 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్ధరాత్రి రెండు వరకు పోలింగ్

నెల్లూరు(దర్గామిట్ట): తోటపల్లిగూడూరు మండలం తోటపల్లిలో మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల వరకు పోలింగ్ సాగింది. పోలింగ్ తేదీ మారడంతో జిల్లా యంత్రాంగం ఇక్కడ కొత్త ఈవీఎంలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసింది. ఈ పోలింగ్ బూత్‌లో రెండో రోజు 26 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం గాలివాన రావడంతో అక్కడ పలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.
- కందుకూరు నియోజకవర్గంలోని 20 పోలింగ్ బూత్‌లలోనూ ఇదే పరిస్థితి.

సిబ్బంది తిరుగుముఖం

నెల్లూరు(దర్గామిట్ట): పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వస్తూనే ఉన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లను అప్పగించిన అనంతరం సిబ్బంది తిరుగుముఖం పట్టారు.

ఎన్నికలు ఏకపక్షం

సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. ఈవీఎంలలో నేతల భవితవ్యం నిక్షిప్తమైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా పెరిగిన పోలింగ్ సరళి అటు పార్టీలు.. ఇటు అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కౌంటింగ్‌కు మరో 20 రోజులు ఉండటంతో నరాలు తెగే ఉత్కంఠ, ఊపిరి సలపని విధంగా టెన్షన్ పెరుగుతోంది. ఓటింగ్ శాతం భారీగా పెరగడం ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతమని టీడీపీ భావిస్తోంది. అయితే రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పరవళ్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ చెక్కుచెదరకపోగా, నానాటికీ అధికమవుతోంది. ఈ తరుణంలో ఈ ఎన్నికలూ ఏకపక్షమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

- గత సరళే కనిపించిందంటున్న విశ్లేషకులు
- భారీగా పోలింగ్
- పోటెత్తిన మహిళా ఓటర్లు
- సర్వేపల్లిలో 83 శాతం నమోదు
- మండలాల్లోనూ ఇదే తీరు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఈ ఎన్నికల్లోనూ ప్రజలు తమ ఓటును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే వేశారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పథకాలు, అభివృద్ధితో రాష్ట్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరుగులు పెట్టించారు. ఈ తరుణంలో ఆయనకే ప్రజలు మరోసారి జై కొట్టారనే టాక్ రాష్ట్రవ్యాప్తంగా నడుస్తోంది.



నెల్లూరులోని మూలాపేటలో గల ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన మహిళా ఓటర్లు

ఇది కదా అభివృద్ధి..

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దాదాపు రెండు లక్షలపైగా ఉద్యోగాలను కల్పించారు. దీని ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసి ప్రజాభిమానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూరగొన్నారు.
- వైద్య రంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. పట్టణ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు.. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇంటి వద్దే వైద్యసేవలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- పేదంటి పిల్లలు ఉన్నత చదువులను అభ్యసించేందుకు వీలుగా నాణ్యమైన విద్యకు పునాదులేశారు.
- రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించేలా ప్రణాళికలను రూపొందించారు.
- పరిశ్రమలు.. పోర్టు.. హార్బర్‌తో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కడా కనిపించడం లేదు.

విష ప్రచారంతోనే పబ్బం

2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిన చంద్రబాబు.. తాజా ఎన్నికల్లో విష ప్రచారాలతో పబ్బం గడుపుకొన్నారు. సంక్షేమ పథకాలతో శ్రీలంక మాదిరిగా రాష్ట్రం తయారవుతుందని.. వలంటీర్ల వ్యవస్థ అవసరం లేదని.. ఇలా విషం చిమ్మిన ఆయన ఎన్నికల సమయానికి మాట మార్చేశారు. వీటి కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ బూటకపు ప్రచారాలకు మరోసారి తెరలేపారు. ఇవన్నీ ఓ ఎత్తయితే ఎన్నికల సమయాన తన మనుషులతో ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి పింఛన్ల పంపిణీ ప్రక్రియకు వలంటీర్లను దూరం చేశారు. ఈ పరిణామాలతో పింఛన్లు పొందేందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు నానా అగచాట్లు పడ్డారు. ఎండల తీవ్రత తాళలేక.. వీటిని సకాలంలో పొందలేక వీరు పడిన అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇవన్నీ చంద్రబాబుకు ప్రతికూలంగా మారాయి.

ప్రతి చోట పెరిగిన ఓటింగ్

పోలింగ్‌కు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు పోటెత్తారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటేసేందుకు తరలివచ్చారు. గతంతో పోలిస్తే జిల్లాలో ఈసారి దాదాపు రెండు నుంచి మూడు శాతం మేర పోలింగ్ పెరిగింది. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 83 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రభుత్వంపై వ్యతిరేకత లేకపోవడం.. ప్రతిపక్షంపై సానుకూలత లేకపోవడం వంటి అంశాలపై విశ్లేషకులు తమ మనోగతాన్ని తెలియజేస్తున్నారు. ఈ పోలింగ్ సరళి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గుచూపుతుందని చెప్తున్నారు. మరోవైపు టీడీపీ మాత్రం తాము ప్రకటించిన మేనిఫెస్టో అనుకూలంగా మారిందని ప్రచారం చేసుకుంటూ ఆనందం పొందుతోంది.

డబ్బును పారించిన పచ్చ పార్టీ

క్షేత్రస్థాయిలో టీడీపీ గ్రాఫ్ అంత గొప్పగా లేకపోవడంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పర్వానికి తెరలేపారు. ఓటుకు భారీ మొత్తంలో పంపిణీ చేశారు. అయితే సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు జై కొట్టారనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ కారణంతోనే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు భారీగా ఓటేశారని తెలుస్తోంది.



జీజీహెచ్‌లో ఓపీ స్లిప్పు కోసం బారులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆరోగ్య భాగ్యం..

- పెద్దాస్పత్రిలో సూపర్ స్పెషాల్టీ సేవలు
- ఆధునిక యంత్రాలతో వ్యాధుల గుర్తింపు
- రానున్న అదనపు నిధులు
- పెరిగిన ఓపీ, ఐపీ సేవలు

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రజలకు నాణ్యమైన స్పెషాల్టీ సేవలను అందించాలనే లక్ష్యంతో నిధులు, భవనాలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా నగరంలోని దర్గామిట్టలో గల జీజీహెచ్‌లో సూపర్ స్పెషాల్టీ డాక్టర్లను నాలుగు నెలల క్రితం నియమించి సేవలను ప్రారంభించారు. ఇప్పటి వరకు నరాలు, కేన్సర్, మూత్రాశయం లాంటి సమస్యలకు కార్పొరేట్ ఆస్పత్రులకెళ్లి లక్షలను ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం పేద, ధనిక అనే తేడా లేకుండా పెద్దాస్పత్రిలో నాణ్యమైన సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలను ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో సాధారణ, స్పెషాల్టీ విభాగాల్లో ఓపీ సేవల సంఖ్య గణనీయంగా పెరిగింది.

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇప్పటికే వైద్య రంగంలో పలు సంస్కరణలను ప్రభుత్వం తీసుకొచ్చింది. పెద్దాస్పత్రిలో డాక్టర్ల పోస్టులను భర్తీ చేయడంతో పాటు నర్సింగ్ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించారు. గత టీడీపీ పాలనలో ఓపీ సంఖ్య 700 నుంచి 800 ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య వెయ్యి నుంచి 1200కుపైగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఇన్ పేషెంట్లు సుమారు 300 మంది ఉండగా, ప్రస్తుతం 500 నుంచి 550 వరకు చేరింది.

స్పెషాల్టీ సేవలు ప్రారంభం

పెద్దాస్పత్రిలో న్యూరాలజీ, యూరాలజీ, ఆంకాలజీ విభాగాలను ఇటీవల ఏర్పాటు చేశారు. ఇందులో డాక్టర్లను పూర్తి స్థాయిలో నియమించారు. కార్డియాలజీ విభాగాన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ కళాశాలలో తొలిసారిగా పీజీ సీట్లు గతేడాది రావడంతో రోగులకు మరింత నాణ్యమైన సేవలందించేందుకు అవకాశం ఏర్పడింది. మరోవైపు మెడికల్ ఆంకాలజీ విభాగంలో ఓపీ రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. రెండు నెలల క్రితం వరకు రోజుకు సుమారు 10 ఓపీ ఉండగా, ఇప్పుడది 50కు చేరింది. న్యూరాలజీలో రోజూ సుమారు 40 మందికిపైగా ఓపీ రోగులు వస్తున్నారు. యూరాలజీ విభాగంలోనూ ఇదే పరిస్థితి. పల్మనాలజీ, కీళ్లు – ఎముకలు, చర్మ, ఈఎన్టీ.. నాణ్యమైన చిన్నపిల్లల విభాగం, పీడియాట్రిక్ ఐసీయూ, గైనకాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో అత్యాధునిక పరికరాలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం లేని విధంగా పెద్దాస్పత్రిలో అత్యంత ఆధునిక పరికరాలైన ఎమ్మారై, సీటీ స్కాన్ లాంటి పరీక్షలు చేస్తున్నారు. రోగ నిర్ధారణకు అవసరమైన అన్ని రకాల రక్త పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, 2డీ ఎకో పరికరాలతో పాటు ఆధునిక ల్యాబ్ కోసం ప్రత్యేక భవనాన్ని సిద్ధం చేశారు.



పుట్టిన పిల్లల ఐసీయూ

క్రిటికల్ కేర్ భవన నిర్మాణం వేగవంతం

క్రిటికల్ కేర్ భవనాన్ని రూ.23.75 కోట్లతో 51 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ + 2లో నిర్మిస్తున్నారు. ఆస్పత్రి మెయింటెనెన్స్‌కు రూ.35 లక్షలు విడుదలయ్యాయి. ఇవన్నీ పూర్తయి త్వరలోనే సేవలు ప్రారంభంకానున్నాయి. దీంతో రోగులకు ఏసీతో కూడిన ఎమర్జెన్సీ, ఐసీయూ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవలను వినియోగించుకోండి




కొన్ని రకాల సూపర్ స్పెషాల్టీ సేవలను ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. మరికొన్ని సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. పెద్దాస్పత్రిలో అన్ని రకాల ఆధునిక పరీక్షలు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాల్టీ సేవలకు అవసరమైన యంత్రాలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. పెద్దాస్పత్రిలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఓటెత్తిన చైతన్యం

- అధికారుల చర్యలతో పెరిగిన పోలింగ్ శాతం



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పోలింగ్ శాతం పెరిగేందుకు వృద్ధులు, దివ్యాంగుల ఓట్లు దోహదపడ్డాయి. ఎన్నికలకు ముందే అధికారులు తగు చర్యలు చేపట్టడంతో ఈ లక్ష్యం ఆవిష్కృతమైంది. ఈసారి 85 ఏళ్లపైబడిన వృద్ధులు తమ ఇళ్ల వద్దే ఓటేసేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. దీని కోసం నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి సంబంధించి విస్తృతంగా అవగాహన కల్పించారు. మరోవైపు ఓటింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు.. సాధారణ ప్రజానీకానికి ఇబ్బందుల్లేకుండా తాగునీటి వసతి, టెంట్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు 2,93,157 మందికి గానూ 2,73,157 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని సమాచారం.

జిల్లాలో 80 శాతం పోలింగ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఇది కొంత మేర పెరిగింది. అత్యల్ప ఓటింగ్ శాతం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నమోదైంది.

పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	శాతం
కావలి	83.03
ఆత్మకూరు	83.49
కోవూరు	79.28
నెల్లూరు సిటీ	71.72
నెల్లూరు రూరల్	67.75
సర్వేపల్లి	83.88
కందుకూరు	88.96
ఉదయగిరి	81.90

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తికి సమీపంలో వృద్ధుల ఆశ్రమం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. నల్లపాళెం గ్రామానికి చెందిన మహేంద్ర మోటార్‌బైక్‌పై పొదలకూరుకు వస్తుండగా మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. అతడి తలపై తీవ్రగాయం కావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

స్కూటీ దహనం



కావలి: పట్టణంలోని ఇస్లాంపేటలో నివాసముంటున్న ఆర్టీసీ డ్రైవర్ బండి వెంకయ్య ఇంటి వద్ద ఉన్న స్కూటీని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసినట్లు మంగళవారం కావలి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. సోయవారం రాత్రి ఈ దారుణానికి ఒడిగట్టారని, స్కూటీ పక్కనే ఉన్న వాషింగ్ మెషీన్ కూడా కొంత మేర దెబ్బతిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రైవర్ వెంకయ్య ఎన్నికల విధుల్లో ఆత్మకూరులో ఉండగా కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్నారు.

న్యాయవాదులకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తులు రాఘవేంద్ర, జానకి

పుత్తూరు: న్యాయవాదులు మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘవేంద్ర సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వ్యాజ్యం కంటే మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సంతృప్తికరమైన ఫలితం పొందవచ్చని వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడిన కేసుల్లో కోర్టు ఫీజులను వాపసు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇంకా కక్షిదారులకు ఆందోళన తగ్గి, మనశ్శాంతి కలుగుతుందన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ జూన్ 29వ తేదీన కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి మురళి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.813 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.813 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సిటీలో 2024 – 25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమాశ్రీ మంగళవారం తెలిపారు. ఆచార్య, ఎంఏ శబ్ద బోధ, ఎంఏ హిందీ, ఎమ్మెస్సీ యోగా థెరఫీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) పాసైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా రెగ్యులర్ పద్ధతిలో ప్రాక్ శాస్త్రి కోర్సులో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 160
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 178



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30





ఏర్పాట్ల గురించి ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



పోలింగ్ కేంద్రాల వద్ద నుంచి తీసుకొచ్చిన పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



భద్రపరిచేందుకు తెచ్చిన ఈవీఎంలు, ఇతర సామగ్రి

ఓటరు తీర్పు భద్రంగా..

జిల్లాలో పోలింగ్ ముగిసింది. ఈవీఎంలు నెల్లూరు కనుపర్తిపాడు ప్రియదర్శిని కళాశాల నార్త్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు చేరాయి. మంగళవారం ఎన్నికల అధికారులు వాటిని భద్రపరిచే ప్రక్రియను నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను గదుల్లో పెట్టి సీల్ వేశారు. కలెక్టర్ హరినారాయణన్ ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. భద్రత గురించి ఆరాతీశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వెబ్ కాస్టింగ్ కోసం వినియోగించిన సీసీ కెమెరాలు, సామగ్రి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేస్తున్న అధికారులు



లోపలికి వెళ్లే వారిని తనిఖీ చేసేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది



రిసెప్షన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది వెళ్లిపోయాక ఇలా..



స్ట్రాంగ్‌రూమ్ వద్ద బందోబస్తు విధుల్లో బీఎస్ఎఫ్ బలగాలు

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు(అర్బన్): ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బుతో బాధపడుతున్న ఓ మహిళా రోగికి అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్ రెడ్డి, హెడ్ ఆఫ్ ది క్రిటికల్ కేర్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ రాజేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన 26 ఏళ్ల సుభాషిణి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ గత వారం తమ ఆస్పత్రిలో చేరిందన్నారు. అన్ని రకాలు పరీక్షలు చేయగా ఊపిరితిత్తుల్లో గడ్డ ఏర్పడి చీము పట్టినట్లు గుర్తించామన్నారు. ఇలాంటి అరుదైన రోగులను చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు డాక్టర్లు రోగులను రెఫర్ చేస్తారన్నారు. అయితే తాము ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నట్లు చెప్పామన్నారు. రోగి తల్లిదండ్రులకు రిస్క్‌ను వివరించామన్నారు. వారి సమ్మతితో ఆపరేషన్‌ను విజయవంతం చేశామన్నారు. హాస్పిటల్లో అత్యంత అధునాతన ల్యాబ్, థియేటర్, పరికరాల వల్లే తాము ఇలాంటి రోగులకు వైద్యం అందించామన్నారు.



మాట్లాడుతున్న పల్మనాలజిస్ట్ కౌశిక్‌రెడ్డి తదితరులు

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

తడ: ఏం కష్టం వచ్చిందో తెలియదుగానీ ఓ వృద్ధుడు ఉరేసుకుని తనువు చాలించాడు. ఎస్సై పి.నరసింహారావు కథనం మేరకు.. మండలంలోని తడకండ్రిగ కారు స్టాండ్ వద్ద ఉన్న చెట్టుకు గుర్తుతెలియని వృద్ధుడు ఉరేసుకున్నట్లు మంగళవారం తెల్లవారుజామున సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న వృద్ధుడు లుంగీ చింపి చెట్టుకు ఉరేసుకుని ఉన్నాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దింపి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు నల్లటి ప్యాంట్ వేసుకుని ఉన్నాడు. వైట్ కలర్ షర్టును తీసి పక్కన ఉంచాడు. అతని వద్ద నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఇచ్చే అన్నదానం టికెట్ ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దళిత సంఘాల నిరసన

వెంకటగిరిరూరల్: పట్టణంలోని రాణిపేట సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆగంతకులు ధ్వంసం చేయడంపై దళిత ప్రజాసంఘాల నేతలు నిరసన తెలిపారు. క్రాస్‌రోడ్డు కూడలిలో మంగళవారం గంటపాటు బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో నాలుగువైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై జిత్యానాయక్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించి చర్యలు తీసుంటామని హామీ ఇవ్వడంతో వారు నిరసనను ఆపారు.



నిరసన తెలుపుతున్న నేతలు

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో నాయకులు

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టారని, ఈసారి కూడా ప్రభంజనం సృష్టిస్తామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ ఫలాలు, మంచితో రాష్ట్ర ప్రజలు మరోసారి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. అత్యధిక స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో 80 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. కార్యకర్తలు, నేతలు తన గెలుపు కోసం కృషి చేశారని, అదేవిధంగా వలంటీర్లు రాజీనామా చేసి పార్టీ కోసం పనిచేసినట్లు పేర్కొన్నారు. వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులకు ఎళ్లవేళలా అండగా ఉండనున్నట్లు తెలిపారు.

ఓటమి భయంతో టీడీపీ నేతలు

ఓటమి భయంతోనే రాష్ట్రంలో టీడీపీ నేతలు అల్లర్లకు పాల్పడుతున్నట్లు నేదురుమల్లి చెప్పారు. దీంతో పలుచోట్ల వివాదాలకు తెరలేపుతూ, విధ్వంసాలు సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. పట్టణంలోని రాణిపేట సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేదురుమల్లి తెలిపారు. ఆ ప్రాంతంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

• వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని నేదురుమల్లి నివాసం మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలతో కోలాహలంగా మారింది. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు.

నాంచారమ్మ ఆలయంలో చోరీ



పగులగొట్టిన హుండీ

దక్కిలి: మండలంలోని కుప్పాయిపాళెం గ్రామదేవత నాంచారమ్మ తల్లి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 9 కేజీల విలువజేసే అమ్మవారి త్రిశూలాన్ని ఎత్తుకెళ్లారు. మంగళవారం గుర్తించిన గ్రామస్తులు దక్కిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోళ్ల ఫారంపై కూలిన చెట్టు

• రూ.3 లక్షలకు పైగా నష్టం

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రానికి సమీపంలోని బోడిగుట్ట వద్ద షెడ్డు కూలి కోళ్లు మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రానికి చెందిన ఎల్.రజీవుల్లా కుటుంబసభ్యులు కోళ్ల ఫారం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన గాలివానకు చెట్టు కూలి సమీపంలోని కోళ్ల ఫారంపై పడింది. అక్కడి షెడ్డు గోడ నేలకొరగడంతో ఫారంలోని కోళ్లు మృతిచెందాయి. ఈ ఘటనలో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు కంటతడిపెట్టారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

గంగమ్మ నామావళి సీడీ ఆవిష్కరణ

తిరుపతి మంగళం: తాతయ్యగుంట గంగమ్మ తల్లి నామావళి సీడీని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పద్మావతిపురంలోని తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. వర్ధ మ్యూజిక్ అకాడమీ సమర్పణలో డాక్టర్ విజయలక్ష్మి రచించి, కోనేరు లక్ష్మీరాజ్యంతో కలిసి గానం చేయగా, ఆర్.కళ్యాణ్ కుమార్ సంగీతం సమకూర్చారు. గతేడాది సినీ గాయకురాలు మంగ్లీతోపాటు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, భూమన అభినయ్ ఆలపించిన గంగమ్మ పాటలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు వచ్చాయి. ఈ ఏడాది కూడా పాటలు భక్తులను అలరించేలా రూపొందించినట్లు తెలిపారు. జాతరను వైభవంగా నిర్వహించుకుందామని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తొండమల్ల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటార్‌బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

• ఇద్దరికి తీవ్రగాయాలు

లింగసముద్రం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు బంగ్లా వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్సై ఎం.బాజీబాబు కథనం మేరకు.. మొగిలిచర్ల గ్రామానికి చెందిన నాగినేని వేణుగోపాల్ (21), పడిదపు మాల్యాద్రి లింగసముద్రంలో స్నేహితులతో క్రికెట్ ఆడారు. మోటార్‌బైక్‌పై ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో మొగిలిచర్ల వెళ్లే రోడ్డులో రాళ్లపాడు ప్రాజెక్టు బంగ్లా మలుపు వద్ద కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన గొర్ల హరికృష్ణ లింగసముద్రం వైపు బైక్‌పై వైపు వస్తున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో రోడ్డుపై కిందపడ్డారు. వేణుగోపాల్ అక్కడికక్కడే మృతిచెందగా మాల్యాద్రి, హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు చూసి ఆటోలో వారిని లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న వేణుగోపాల్ కుటుంబసభ్యులు లింగసముద్రం పీహెచ్‌సీకి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన మాల్యాద్రి, హరికృష్ణలను కూడా కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

చింతవరంలో వ్యక్తిపై దాడి

చిల్లకూరు: తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడి చేయడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. చింతవరం గ్రామానికి చెందిన జాలాది గోపాల్ అదే గ్రామంలో రైతు డిపో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం జరిగిన ఎన్నికల్లో స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన యువకులతో కొంత వివాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం గోపాల్ రైతు డిపో తెరిచే సమయంలో చింతవరం కొత్తపాళేనికి చెందిన దిలీప్, చెంచయ్య, కాంత్రి అక్కడికి చేరుకుని అతనితో గొడవపడ్డారు. రాడ్డుతో తలపై మోదడంతో గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. యువకులు పారిపోయారు. గమనించిన స్థానికులు బాధితుడిని నెల్లూరులోని ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.